# 'లోకము గ్రుడ్డిది'

కొవ్వాలి లక్ష్మీనరసింహారావుగారు

ఆమె వయసు పదునారేండ్లు. వివిధభావల నభ్యసించిన వినయవతి. ఆమె రంగు చామనచాయ. తీర్చి దిద్దిన కనుముక్కు-తీరు-దీర్ఘములైన కురులు-నునుపైన లేతచెక్కులు-ఆమె సౌందర్యాతిశయమును చాటుతుండేవి.

ఏమయిన నేమి? ఆమె విధవరాలు. సూర్యరశ్మిలేని కమలము భాతి యామె తనూలత నానాటికి వాడుమొగము పట్టినది. ఆమెకు జీవిత మొకవెగటుమందయినది. విద్యాశక్తి నానాటికి సన్నగిలజొచ్చినది.

హేమకు తలిదండ్రు లూరిలేనప్పుడు ప్రబలమైన జ్వరము వచ్చినది. మంచము దిగుటకు గూడ నామె యసమర్థురాలాయెను. అంతకు మున్నెన్నడును నామె పొరుగింటి శ్యామును కన్నెత్తియైన చూడలేదు. ఆ యువకుడు యోగ్యుడనిమాత్ర మామె వినియున్నది.

ఉదారుడగు శ్యాము హేమ కెల్లవిధముల నుపచర్యల గావించి యుత్తములగు వైద్యులచే నౌషధసేవనము జేయించెను.

హేమకు క్రమముగా వ్యాధి మళ్లినది. హేమజీవితములో నొక దివ్యజ్యోతి వెలుగుచున్న దిప్పుడు. శ్యాము దర్శనము- విద్యాప్రసంగములు- ఆమె హృదయమునకు సంపూర్ణస్వస్థతను చేకూర్చినవి.

హేమ తలిదండ్రులు గ్రామాంతరమునుండి వచ్చిరి. హేమా శ్యాముల వృత్తాంతమును పన్నెచిన్నెలతో వాడవాడల జెప్పుకొనుచుండుటను విని వారు భరించలేకపోయిరి. హేమతండ్రియగు శర్మ యీయప్రతిష్ఠకు తాళజాలకపోయెను.

ఆనాడు సంక్రాంతిపండుగ. మామూలుప్రకారము శ్యాము హేమను జూడవచ్చెను. శర్మ శ్యామును పండుగకు తమయింట పాయసమును ద్రావుమని నిర్బంధించెను. దానిని నిరాకరించిన, హేమ చిన్నబుచ్చుకొనునను తలంపుతో శ్యాము పాయసమును ద్రాగి యింటికి బోయెను.

'శ్యాము నెత్తురు కక్కుకొని మరణించెను.' అను దుర్వార్త ఆ క్షణమె యూరంతయు పాకినది. హేమకు హృదయము ప్రీలిపోయినది- ఇపు డామె యున్మాదిని. అప్పుడప్పుడు హేమను జూచు సద్ధర్ములగులోకులుకొందరిప్పుడును 'హేమాశ్యాముల పవిత్రసోదర వాత్సల్యము నీ లోకము గుర్తింపలేకపోయినది- ఈ లోకము గ్రుడ్డిది' అనుచుందురు.